క్లుప్తంగా

హిందీ భాషపై పట్టు అవసరం



చెరుకుపల్లి: విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్ భాషలతో పాటు హిందీ కూడా రాయటం, చదవటం, మాట్లాడటం నేర్చుకోవాలని గుళ్లపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె.కవిత తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు ఎ.మాధవి టి.అనుపమ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలతో కూడిన పోటీలు నిర్వహించారు, అందులో కథలు చెప్పటం, పద్యాలు, బాల గేయాలు, బోధన పరికరాల ప్రదర్శన, పాటలు పోటీలు నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్ఎం వి.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ నాంచారయ్య, ఉపాధ్యాయులు జక్రయ్య, బి.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

హాజరుశాతం పెంపునకు కృషి చేయాలి



బోలాయపాలెం(కర్లపాలెం): విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిధిలోని బోలాయపాలెం గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసరావు సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలోని విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధించడం జరుగుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కర్లపాలెం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వండి వడ్డించాలని ఎంఈఓ మనోరంజని చెప్పారు. బుధవారం కర్లపాలెం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తుందని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరే విధంగా నాణ్యమైన ఆహార పదార్థాలతో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేసి విద్యార్థులకు ఆమె వడ్డించారు. హెచ్ఎం ఇనకొల్లు పోలీసేరావు, ఉపాధ్యాయులు ఎం.ఇందుమతి, డీఎల్ ప్రసన్న, విద్యార్థులు ఉన్నారు.

యలవర్రులో 'పొలం పిలుస్తోంది'



అమర్తలూరు(వేమూరు): రైతులందరు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాదికారి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించి, పంటపొలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మినుము, పెసర 20 రోజుల్లోపు కోయటానికి సిద్ధంగా ఉన్నాయని, రైతులు మల్లీకే లేదా 19-19-19 వంటి ఎరువులు పిచికారీ చేయడం వల్ల పంట అఖరి దశలో వచ్చే బెట్ట నుంచి కాపాడుకోవచ్చని సూచించారు. మండల వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో నేటి నుంచి సువార్త సభలు

తెనాలిఅర్బన్: దేవుని పరిశుద్ధాత్మ ఆలయం 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్‌లో గురు, శుక్ర వారాలలో యేసు క్రీస్తు రక్షణ సువార్త స్వస్థత మహాసభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు షేక్ హుస్సేనమ్మ, షేక్ ప్రభుకుమార్, షేక్ ఈసావలిలు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 11 గంటలకు, రాత్రి 7గంటలకు సభలు జరుగుతాయని చెప్పారు.

గుండెకు 'స్టెమీ' భరోసా

- స్టెమీ ప్రాజెక్టుతో గుండె రోగులకు అభయం
- గ్రామాల్లోని పీహెచ్‌సీల్లోనూ ఉచితంగా ఇంజక్షన్లు
- అందుబాటులోకి తెచ్చిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- రేపల్లెలో ఇప్పటికి 28 మందికి 'స్టెమీ' ఇంజక్షన్లు అందజేత



ప్రభుత్వ వైద్యశాలలో సిద్ధంగా ఉన్న ఇంజక్షన్

రేపల్లె రూరల్: నిద్ర లేచింది మొదలు ఉరుకులు, పరుగుల జీవనం. ఉద్యోగ, వ్యాపారాల్లో నిత్యం ఒత్తిడితో నిండిన జీవన విధానం, దీర్ఘకాలిక వ్యాధులతో ప్రజలు గుండె సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇటీవలికాలంలో గుండె పోటు మరణాల గురించి తరచూ వింటూ ఉన్నాం. సెలబ్రిటీల దగ్గర నుంచి సామాన్యుల వరకు దీనిబారిన పడి మరణించిన సందర్భాలు చూస్తుఉన్నాం. అయితే గత ప్రభుత్వ హయాంలో గుండెపోటుతో ఎవరూ మృతి చెందకూడదన్న మాజీ సీఎం వైఎస్ జగన్ సంకల్పంతో పట్టణాల నుంచి గ్రామీణ స్థాయిలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో స్టెమీ ప్రాజెక్ట్ వచ్చేసి ప్రజలకు భరోసా కల్పించింది.

మాజీ సీఎం వైఎస్ జగన్ సంకల్పంతో..

గుండె పోటు వచ్చిన వారికి గతంలో ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన చికిత్స అందేది కాదు. గుండెకు అంతంత మాత్రంగా ప్రాథమిక చికిత్స చేసి అనంతరం పెద్ద వైద్యశాలలకు తరలించేవారు. అయితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుండె జబ్బులతో ఎవరూ మృతి చెందరాదన్న ఉద్దేశ్యంతో 2023లో ప్రారంభించిన స్టెమీ ప్రాజెక్ట్ పలువురి గుండెలకు రక్షణనిస్తోంది. సుమారు రూ.45 వేల నుంచి రూ.50వేల విలువ చేసే ఇంజెక్షన్‌ను ప్రజలకు ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా అందించేందుకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పించి, అందజేశారు.

రేపల్లె సీహెచ్‌సీలో 28 మందికి సేవలు..

గుండె పోటు వచ్చిన మొదటి గంట గోల్డెన్ అవర్‌లో ఇంజెక్షన్ అందించి ప్రాణాలు నిలబెట్టటమే స్టెమీ ప్రాజెక్ట్ లక్ష్యం. రేపల్లె సీహెచ్‌సీలో స్టెమీ సేవలు ప్రారంభమైన నాటి నుంచి 28 మంది స్టెమీ వైద్యసేవలు పొందారు. దీనిలో భాగంగా ఒక్కొక్కరికి రూ.45వేల విలువ చేసే టెనెక్ట్ ప్లస్ ఇంజెక్షన్‌లు అందించారు. రేపల్లె నియోజకవర్గంలోని పలు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారే ఈ వైద్యసేవలు అధికంగా పొందారు. అయితే ఒక వ్యక్తి మాత్రం గుంటూరు వైద్యశాలకు రిఫర్ చేయబడినట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

ఇంజక్షన్‌లు అందుబాటులో ఉన్నాయి..

ప్రభుత్వ వైద్యశాలలో గుండె పోటుకు సంబంధించి ఇంజక్షన్‌లు అందుబాటులో ఉన్నాయి. పరిసర ప్రాంతాలలో ఎవరైనా గుండెపోటుకు గురైతే గంటలోపల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురావాలి. రూ.45వేల విలువ చేసే ఇంజెక్షన్‌ను ఉచితంగా అందిస్తాం. ఎవరైనా ఛాతీలో నొప్పిగా ఉందంటూ వైద్యశాలకు వస్తే ఈసీజీలో వచ్చిన ఫలితాలను ఆధారంగా గుంటూరు వైద్యశాల వైద్యుల సూచనలతో రోగులకు వైద్యసేవలు అందిస్తున్నాం. ఆర్థికంగా ఇబ్బందులు పడే పేద, మధ్యతరగతి ప్రజలు వైద్యసేవలపరంగా ఉపశమనం పొందవచ్చు.

– సుధాకర్, సూపరింటెండెంట్, రేపల్లె ప్రభుత్వ వైద్యశాల

సూర్యలంకకు పెరుగుతున్న పర్యాటకులు

- పెరుగుతున్న ఎండలే కారణం
- మూడు నెలలు పాటు తీరంలో సందడే..

బాపట్ల: వేసవి తాపం రోజురోజుకు పెరిగిపోవటంతో సముద్ర స్నానాలకు వచ్చే పర్యాటకుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సముద్రతీర ప్రాంతానికి వచ్చే పర్యాటకులతో తీరంలో సందడి నెలకొంటుంది. అయితే ప్రస్తుతం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఎండ తీవ్రతకు తల్లడిల్లిపోతున్నారు. భగభగ మండుతున్న భానుడి తాపాన్ని తట్టుకునేందుకు సూర్యలంక తీరంలో సేదతీరుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి రవాణా సౌకర్యం అనుకూలంగా ఉండటంతో అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తీరంలోనే గడుపుతున్నారు. ముఖ్యంగా బాపట్లతోపాటు గుంటూరు, కృష్ణా జిల్లాలతోపాటు సుదూరప్రాంతాల నుంచి కూడా సముద్ర స్నానాలకు వచ్చేవారితో తీరంలో సందడి వాతావరణం నెలకొంది. అదేవిధంగా సముద్రతీరంలో జీడిమామిడి తోటలు అధికంగా ఉండటంతో స్నానాల అనంతరం ఆ తోటల్లో భోజనాలు చేసి జీడిచెట్ల కిందనే విశ్రాంతి తీసుకుంటున్నారు.



సూర్యలంక తీరంలో పర్యాటకుల సందడి

ఆటపాటలతో కూడిన విద్యతో వికాసం



రేపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుచిత్ర



గోకర్ణమఠంలో జరిగిన శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ శేషుబాబు

రేపల్లె రూరల్: ఆటపాటలతో కూడిన విద్యను అందించటమే కాకుండా చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీపీఓ ఎం.సుచిత్ర తెలిపారు. పట్టణంలోని 3వ వార్డు ఎంపీహెచ్ఆర్ఎస్ స్కూలులో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం బుధవారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీడీపీఓ అంగన్‌వాడీలకు పలు సూచనలు చేశారు. చిన్నారులచే ప్లకార్డులు, ఆట వస్తువుల ప్రదర్శన ద్వారా చిన్నచిన్న పదాలు, వ్యాక్యాలు నేర్పించాలన్నారు. చిన్నారుల ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేస్తూ ఉండాలన్నారు. శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని అంగన్‌వాడీలు చిన్నారుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేయాలని కోరారు. ఉపాధ్యాయులు టి.సురేష్, ప్రభాకర్, సూపర్‌వైజర్ శివజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపట్నం: మండలంలోని గోకర్ణమఠం గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం బుధవారంతో రెండవ రోజుకు చేరింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ శేషుబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్పీలు సీహెచ్ గణేష్‌రావు, ఎం.తులసీదాస్, ప్రసూన్న, గౌరీ జ్యోతిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు కృషి చేయండి

తెనాలిటౌన్: పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల పెంపొందేందుకు కృషి చేయాలని మండల విద్యాధికారి-2 వి జయంతి బాబు పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, సమగ్ర శిక్ష విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతిపై ట్రెనింగ్ ప్రోగ్రామ్‌ను మారీసుపేటలోని ఎస్‌సీఆర్ ఎస్ఎంహెచ్ స్కూల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లల ప్రాథమిక అభ్యాసనాన్ని మెరుగుపరచడానికి శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయన్నారు. జ్ఞాన జ్యోతి ప్రోగ్రామ్ కింద 120 రోజుల పాటు శిక్షణ ఇచ్చి అనంతరం సర్టిఫికెట్స్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఎం.సునీత, శిక్షకులు కె.సౌజన్య శ్రీ, రామరాజు, సీఆర్ఎంటీలు సిహెచ్ శ్రీదేవి, దీపాంజలి, శ్రీనివాస్, జిఆర్‌కె శాస్త్రి, జి.కామేశ్వరి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

తెనాలిఅర్బన్: రక్తదానం చేయటం వల్ల కొందరికి ప్రాణదానం చేసిన వారు అవుతారని ఎస్ఆర్‌కె అండ్ కెవిఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి శాఖ ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ తెనాలి శాఖ చైర్మన్ ముమ్మలనేని భానుమతి, డాక్టర్ మేడూరి భాస్కరరావు, డాక్టర్ పావని ప్రియాంక, నాళం శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, దశరథరామిరెడ్డి, నరేష్, ఆసియా, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

రేపల్లె ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి



కుండీలో నాటిన మొక్కకు నీళ్లు పోస్తున్న ఆర్డీఓ నేలపు రామలక్ష్మి

రేపల్లె రూరల్: మొక్కలు నాటటమే కాకుండా వాటిని కాపాడటం ప్రతి ఒక్కరూ తమ నైతిక బాధ్యతగా తీసుకుని పర్యావరణ పరిరక్షకులుగా మారాలని రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ నేలపు రామలక్ష్మి కోరారు. పట్టణంలోని పెదకూరగాయల మార్కెట్ సమీపంలోని వినాయకుడి ఆలయం ఎదురు రహదారిలో చెత్తను తొలగించి ఆ ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛ రేపల్లె, గ్రీన్ రేపల్లె సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను రహదారులపై, కాల్వలలో పడవేయరాదన్నారు. చెత్తకుండీలలోగాని, ఇంటింటికి వచ్చే పారిశుద్ధ్య కార్మికులకుగాని అందించి స్వచ్ఛ రేపల్లెకు సహకరించాలని కోరారు. అదేవిధంగా మొక్కలు నాటటం, వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకుని భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందించాలని కోరారు. ఈ సందర్భంగా రహదారి పక్కనే కుండీలను ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యాబోధన

సమగ్ర శిక్షా అడిషినల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.నాగిరెడ్డి

బాపట్ల: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన చేయాలని బాపట్ల సమగ్ర శిక్షా అడిషినల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక సమగ్ర శిక్షా కార్యాలయంలో టీచ్ టూల్ బాపట్ల పరిధిలోని టీచ్ టూల్ అబ్జర్వర్స్ సమీక్షా సమావేశం జరిగింది. కో–ఆర్డినేటర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని పేర్కొన్నారు. టీచ్ టూల్ లో శిక్షణ పొందిన శిక్షకులు త్వరగా ఉపాధ్యాయుల తరగతి గది పరిశీలనలు పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం, సమగ్ర శిక్ష కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను వినియోగించుకొని విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రేరణతో కూడిన అభ్యసన కార్యక్రమాలు ఉంటాయని శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తెలుసుకోవాలని చెప్పారు. టీచ్ టూల్ రాష్ట్ర పరిశీలకుడు అబ్రహం లింకన్ మాట్లాడుతూ పరిశీలకులు సత్వరమే తమకు కేటాయించిన పాఠశాలల్లోని ఉపాధ్యాయులను, తరగతి గది పరిశీలన అభ్యసన కార్యక్రమాలను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు పరిశీలకులు తమ దృష్టికి తెచ్చిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సమావేశంలో బాపట్ల సమగ్ర శిక్షా జిల్లా అధికారి బి.మోజెస్, టెక్నికల్ పరిశీలకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణరావు గెలుపునకు కృషి చేయాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



న్యాయవ్యాదులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

రేపల్లె రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా అభ్యర్థిగా పీడీఎఫ్ తరపున పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావును గెలిపించాల్సిన బాధ్యత ప్రతి పట్టభద్రునిపై ఉందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం న్యాయవాదులకు కరపత్రాలను అందజేసి మాట్లాడారు. అసెంబ్లీలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై మాట్లాడాలన్నా, నిరుద్యోగ, ఉద్యోగుల, కార్మికుల సమస్యలపై ధ్వజమెత్తాలన్నా పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు మాత్రమే సాధ్యమన్నారు. పట్టభద్రులు ఎటువంటి ప్రలోభాలకు గురవ్వకుండా తమ అమూల్యమైన ఓటును లక్ష్మణరావుకు వేసి గెలిపించావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్, నాయకులు యడ్లపల్లి కిషోర్‌బాబు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



తెనాలిఅర్బన్: క్రీడల వల్ల మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందని స్పందన ఏడా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఏడా సామ్యూల్ రెడ్డి పేర్కొన్నారు. యువ క్రికెట్ అకాడమి 8వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం రాత్రి చెంచేపేటలో నిర్వహించారు. క్రీడాకారులను తయారు చేస్తున్న ఆకాడమి కోచ్ మాలిక్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది హరిదాసు గౌరిశంకర్, కన్నెగంటి మురళీ, పాలడుగు సురేంద్ర, పెసర్లంక రమణ, నాగిశెట్టి సాయిచరణ్, షేక్ అక్బర్, సాయిగోపి, తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని ఏకతాటిపై నడిపించేందుకు హిందీ దోహదం



జంపని హైస్కూల్‌లో కళావతిని సన్మానిస్తున్న హెచ్ఎం భాగ్యమ్మ, ఉపాధ్యాయులు

జంపని(వేమూరు): అఖిల భారత దేశాన్ని జాగృతం చేసి ఏకతాటిపై నడిపించేందుకు హిందీ భాష దోహదపడుతుందని కేంద్ర ప్రభుత్వ హిందీ భాషా మండలి సభ్యురాలు కళావతి పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం భాగ్యమ్మ అధ్యక్షత వహించారు. కళావతి మాట్లాడుతూ జాతీయ భాష హోదాను రాజ్యాంగం ఏ భాషకు ఇవ్వలేదని, అయినా ఇతర దేశ భాషలు నేర్చుకునేకన్నా హిందీ నేర్చుకోవడం ఉత్తమమన్నారు. అనంతరం కళావతిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస కుమార్, శివయ్య, పోతురాజు, రవిరాజు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి



పెదమట్లపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రమేష్‌బాబు

కర్లపాలెం: ప్రభుత్వ వ్యవసాయ సంబంధిత సబ్సిడీ పథకాలను వినియోగించుకునేందుకు సాగు చేస్తున్న రైతులు ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్య పొందాలని మండల వ్యవసాయాధికారి సుమంత్ కుమార్ చెప్పారు. బుధవారం మండలంలోని సమ్మెటవారిపాలెం, పెదగొల్లపాలెం గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రైతు గుర్తింపు సంఖ్యను పొందాలని సూచించారు. ప్రస్తుతం సొంత భూమి కలిగిన రైతులకు పేర్లు నమోదు చేస్తున్నారని తరువాత కౌలు రైతులకు కూడా గుర్తింపు సంఖ్య కేటాయిస్తారని ఆయన చెప్పారు. రబీ సీజన్‌లో పంట నమోదు చేయించుకున్న రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షబీనా, శివనాగరాజు, రైతులు పాల్గొన్నారు.

పెదమట్లపూడిలో...

నగరం: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఇచ్చే రాయితీలు వర్తించాలంటే రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు చెప్పారు. మండలంలోని పెదమట్లపూడి గ్రామంలో బుధవారం జరిగిన సదస్సులో పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. సొంత భూమి కలిగిన రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి గుర్తింపు సంఖ్య పొందాలన్నారు. పీఎం కిసాన్‌యోజన, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి సాయం వంటి పథకాలు వర్తించాలంటే తప్పనిసరిగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని కోరారు. గ్రామ వ్యవసాయ సహయకులు రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. ఏఈఓ నాగ శ్రీనివాస్, వీఏఏలు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏబీఆర్ క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ టీసీ రామచంద్రరావు, అధ్యాపకులు, తదితరులు

రేపల్లె రూరల్: ఏఎన్‌యూ అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్ పురుషుల పోటీల్లో రేపల్లె పట్టణానికి చెందిన ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడాకారులు ప్రతిభ కనపరిచారు. విశ్వవిద్యాలయ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీలలో జరిగిన పోటీల్లో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన 10 జట్లు పాల్గొనగా పోటీలలో ఏబీఆర్ క్రీడాకారులు తృతీయస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో బుధవారం విద్యార్థులకు కళాశాల సెమినార్ హాలులో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవి చంద్రకుమార్ పాల్గొని మాట్లాడారు. హోరాహోరీగా జరిగిన పోటీల్లో తమ కళాశాల క్రీడాకారులు నాకౌట్ నుంచి లీగ్ దశకు చేరుకుని ప్రతిభ కనపరచటం ఆనందంగా ఉందన్నారు. సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ బాలుర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ప్రథమ సంవత్సరం బీకాం విద్యార్థి బి.మురళీకృష్ణ, ప్రథమ సంవత్సరం బీఏ విద్యార్థి ఎస్.శ్రీమనోహర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎ.కోటేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.బుజ్జిబాబు, ఎం.నరసయ్య, ఎం.నిరంజన్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, క్రీడాకారులను అభినందించారు.

చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వండి

జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ

తెనాలిఅర్బన్: నేటి యువత చదవుకు అధిక ప్రాధాన్యం ఇస్తూ క్రీడలను విస్మరించటం బాధకరమని జేఎంజే కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ పేర్కొన్నారు. జెఎంజే కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల పట్ల అందరు ఆసక్తిని పెంచుకుని వాటిలో రాణించాలని సూచించారు. క్రీడల పరిశీలకులు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలలో రాణించి అనేక మంది ఉన్నత స్థితికి చేరుకున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలలో కూడా క్రీడాకారులకు కొంత రిజర్వేషన్ ఉంటుందని చెప్పారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ సుజాత మాట్లాడుతూ రెండు రోజులు పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల్లో అయిదు టీంలు పాల్గొంటాయన్నారు. మొదటి మ్యాచ్‌లో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాల జట్టులు ఆడాయని, బాపట్ల కళాశాల జట్టు 8-3 పాయింట్లతో గెలుపొందిందని చెప్పారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



తెనాలిటౌన్: మండలంలోని కొలకలూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీరామ సాయి జ్ఞానమందిర 17వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు బుధవారం కనుల పండువగా ముగిశాయి. ఉదయం బాబా వారికి కాగడ హారతి, పంచామృత అభిషేకం, లక్ష్మిగణపతి హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని బాబా వారిని దర్శించి పూజాది కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో శ్రీరామసాయి ట్రస్ట్, శ్రీరామ సాయి జ్ఞాన మందిరం చైర్మన్ సంకా సతీష్, వైస్ చైర్మన్ మలిశెట్టి శ్రీనివాస్, సభ్యులు అకరంశెట్టి నాగేశ్వరరావు, ఎం రోశిరెడ్డి, తోట నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.